# మరపురాని బాటసారి

**బాలగోపాల్** మరణించారంటే నమ్మకం కలగడం లేదు. నేను కాదు ఆయనతో కలసి పనిచేసిన వారెవరూ నమ్మడం కష్టం. ఆయన హఠాన్మరణం ప్రజాస్వామిక ప్రియులను ఒక్కసారిగా అనాథలను చేసింది. తనతోటి ఉద్యమకారులపై ఆయన చెరగని ముద్ర వేశారు. మానవ హక్కుల నేతగా జాతీయ స్థాయికి ఎదిగిన ఈ ఉద్యమకారుడు వ్యక్తిగత జీవితంలో ఎంతో వినమ్రుడు. కార్మికులతో మాట్లాడినా, పాత్రికేయులతో వివరాలు అడిగి తెలుసుకున్నా, తోటి మానవ హక్కుల కార్యకర్తలతో కలిసి పనిచేసినా ఆయన ఎంతో సన్నిహితంగా ఉండేవారు. ఉద్యమకారులకు ఆయన రాకతో కొండంత అండ లభించేది. ప్రత్యేకించి ఉత్తర తెలంగాణలోని జర్నలిస్టులతో, కార్మికులతో, నిర్వాసితులతో, ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబాలతో ఆయన అనుబంధం మరిచి పోలేనిది.

ఉద్యమం తప్ప మరో వ్యాపకంఆయనకు లేదు. ఈ విరామమెరుగని ఉద్యమ ప్రయాణమే ఆయనకు ఎంతో మంది సహ ప్రయాణికులను తోడుంచింది. ఉత్తర తెలంగాణలో నిర్వాసితుల వెంట ఆయన ఉండి ఉద్యమించి, ప్రజలలో చైతన్యం రగిలించారు. మంచిర్యాల ర్యాలీ వాగు వద్ద పాలమూరుకు చెందిన కూలీలు 12 మంది మరణించినప్పుడు అక్కడకూ బాలగోపాల్ వచ్చి చేరి వారికి న్యాయం చేయాలని పోరాడిన రోజులు ఈ ప్రాంతవాసులెవరూ మరచిపోలేరు. బొగ్గు బావుల ప్రమాదాల విషయమై వేదికలపై ప్రకటనలు చేసే నాయకులకు భిన్నంగా ఆయన నిజ నిర్ధారణ సాగేది. విచారణ కోసం ఆయన స్వయంగా బావులలో దిగి నిజనిర్ధారణ జరిపి

నివేదికలు ప్రభుత్వానికి అందజేసిన సంఘటనలను ఏ కార్మికుడైనా మరచిపోగలడా! బొగ్గు గని కార్మికుల సమస్యలపై ప్రమాదాలు జరిగినప్పుడు, మరణాలు సంభవించినప్పుడు ఆయన స్పందించిన తీరు, ఆయన అండదండలు ఎన్నడు మరచిపోలేనివి. తెలంగాణలో ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా బాలగోపాల్ కోసం ఎదురు చూసే రోజులను ఎన్నని లెక్కపెట్టగలం! ఓపెన్‌కాస్ట్‌లకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమంతో మమేకమైన ఆయన హఠాన్మరణం ఇక్కడి గని కార్మికులు జీర్ణించుకోలేకపోతున్నారు. బాలగోపాల్ లాంటి ఉద్యమకారుడు పుట్టడమే అరుదు. ఇకాయన లాంటి వారు మళ్ళీ వస్తారా అంటూ గద్గద స్వరంతో ఆవేదన చెందుతున్నారు.

వాస్తవాలను నిర్భయంగా ప్రజలకు అందించాలనే తపన పడిన పాత్రికేయులతో బాలగోపాల్ అనుబంధం మరింత ఆత్మీయమైనది. మిత్రుడిగా, తత్వవేత్తగా, మార్గదర్శకుడిగా నిలిచిన బాలగోపాల్‌ను ఏ జిల్లా కేంద్రంలోని, మండలంలోని పాత్రికేయుడు మరచిపోలేడు. మంచిర్యాల, గోదావరిఖని, ఆ చుట్టుపక్కల ప్రాంతాల పాత్రికేయులకు బాలగోపాల్‌తో అనుబంధం ఇటీవల మరింత దృఢతరమైంది. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతో ఆయనకు పాతిక సంవత్సరాల అనుబంధం ఉంది. నక్సలైట్ ఉద్యమం తీవ్ర స్థాయిలో ఉన్నప్పుడు నక్సల్స్‌కు ఆశ్రయమిస్తున్నారనే ఆరోపణ ఎవరిపై పడుతుందో తెలియని రోజులు. ఎక్కడో మందు పాతరపేలితే, అందుకు బాధ్యులు వీరేనంటూ కంటబడిన ఏ అమాయకుడిని పట్టుకున్నా అడిగే దిక్కులేని రోజులవి. ఎన్‌కౌంటర్ అనబడే మరణశిక్ష ఎప్పుడు ఎవరికి పడుతుందో తెలియని కాలమది. ఆ పరిస్థితులతో ఉత్తర తెలంగాణలో బాలగోపాల్ తిరగని ప్రాంతం లేదు. ఆయన దృఢ దీక్ష పాత్రికేయులకు స్ఫూర్తిని ఇచ్చేది.

బాలగోపాల్‌తో వ్యక్తిగతంగా నా సాన్నిహిత్యం మరచిపోలేనిది. ఆదిలాబాద్ జిల్లాలో 1980 దశకంలో జరిగిన పలు పోలీసు ఎన్‌కౌంటర్ల సందర్భంగా ఆయన వెంట నిజనిర్ధారణ కోసం జిల్లా నుంచి ఒక్కోసారి ఏ నాయకుడు కనిపించే వారు కాదు. కేవలం జర్నలిస్టులే ఆయన వెంట ఉండువారు. రెండు, మూడు రోజులు జిల్లాలో గడిపిన సందర్భాలలో ఆయన మా ఇంట్లో కూడా ఉండేవారు. స్నానం చేసిన తరువాత

ఆయన మళ్లీ ముఖం ఎప్పుడు కడిగేవారో కూడా కనిపించేది కాదు. ఆయన ఇస్త్రీ బట్టలు వేసుకున్న దాఖలులు ఎన్నడూ కనిపించలేదు. తలకు దువ్వెన పెట్టి దూసింది కనిపించదు... ఒక్కోసారి హైదరాబాద్‌లో రాత్రి బస్సు ఎక్కి తెల్లవారు జామున దిగగానే ఫోన్ చేసేవారు. వస్తే వెంట రండీ, లేకుంటే నీ మోటారు సైకిల్ ఇచ్చేయ్ అనేవారు. ఇలా చాలా సందర్భాలలో నా మోటారు సైకిల్ ఆయనకు ఇచ్చేసి నా పని నేను చూసుకుంటే ఆయన పని ఆయన చూసుకొని వెళ్లిపోయేవారు. ఒక్కోసారి స్థానిక సమస్యలపై కాసేపుకూర్చొని ముచ్చటించేవారు. జిల్లాకు వచ్చినప్పుడు కలిసే టైం లేనపుడు ఫోన్ చేసి సమయం లేదు, కలవడం కుదరడం లేదు మిత్రమా..! అని ఫోన్ చేసేవారు... అంతటి నిగర్వి బాలగోపాల్.

గత సంవత్సరం ఓపెన్‌కాస్ట్‌కు వ్యతిరేకంగా ఇందారం వద్ద అఖిల పక్ష కమిటి ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాటు చేసినప్పుడు ఆయన వేదిక కింద నేలపై కూర్చొని మానవ హక్కులకు సంబంధించిన కొన్ని పుస్తకాలను అమ్మడం ఆశ్చర్యం వేసింది. ఓసారి కాగజ్‌నగర్‌కు బస్సులో వెళ్ళి అక్కడ నుంచి ఎన్‌కౌంటర్ సంఘటన స్థలానికి సైకిళ్లపై వెళ్ళాల్సిన పరిస్థితి వచ్చింది. మాకు ఒకే సైకిల్ దొరికింది. నన్ను కూర్చోబెట్టుకుని సైకిల్ తొక్కుతానని కొద్ది సేపు సైకిల్ తొక్కి ఇక నాతో కాదు, నీ బరువు నేను మోయలేను, నువ్వే తొక్కు అంటూ మళ్లీ నాకే సైకిల్ ఇచ్చేసి నాతో పాటు వచ్చారాయన. పలు చోట్ల పదే పదే ఆపి టీ తాగేవారు. ఈ సందర్భంలో కూడా ఏదో ఒక విషయం చర్చించారు. మూడు దశాబ్దాల అనుబంధాన్ని మరచిపోలేని ఆ ఉద్యమకారుడికి అశ్రునివాళి.

**- ఎండి. మునీర్**

*ఆంధ్రజ్యోతి, అక్టోబరు 10, 2009*